క్లుప్తంగా

రెజ్లింగ్ పోటీల్లో ఇందన్‌పల్లి విద్యార్థినికి పతకం



పతకం, ప్రశంసా పత్రంతో సహస్ర

జన్నారం: రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో జన్నారం ఇందన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని సాహస్ర ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు నారాయణపేట్‌లో జరిగిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలలో సహస్ర మూడోస్థానంలో నిలిచి కాస్యం సాధించినట్లు హెచ్‌ఎం రాజేందర్, పీడీ శివనూరి తిరుపతి తెలిపారు. ఈ సందర్భంగా సాహస్రను గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో జిల్లా క్రీడాకారులకు కాంస్య పతకాలు

తాండూర్: రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో తాండూర్ మండలం అచ్చలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. మూడు రోజులుగా గద్వాలలో నిర్వహిస్తున్న పోటీల్లో పాల్గొన్న కె.శ్రీవల్లి, ఈశ్వరి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాలు గెలుచుకున్నారు. పతకాలు సాధించిన విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, ఫిజికల్ డైరెక్టర్ సాంబమూర్తి , ఉపాధ్యాయులు అభినందించారు.

డీలర్లు నిబంధనలు పాటించాలి

నెన్నెల: మండలంలో పురుగుల మందులు, విత్తనాలు, ఎరువుల విక్రయ డీలర్లు నియమ నిబంధనలు పాటించి, నిర్ణయించిన ధరలకు విక్రయించాలని భీమిని డివిజన్ ఏడీఏ సురేఖ అన్నారు. వ్యవసాయ శాఖ కార్యాలయంలో శనివారం ఫర్టిలైజర్ డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ స్టాక్, బిల్లు రిజిస్టర్‌లు సంబంధిత అధికారితో ధ్రువీకరించుకోవాలని పేర్కొన్నారు. ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ ధరకు విక్రయించొద్దని స్పష్టం చేశారు. షాపుల వద్ద స్టాక్‌కు సంబంధించిన వివరాలను ప్రదర్శించాలని తెలిపారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు అందించాలని కోరారు. అనంతరం నందులపల్లిలో క్షేత్రస్థాయిలో వరి, పత్తి పంటలను పరిశీలించి రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఆమె వెంట ఏఈవోలు రాంచందర్, సుప్రజ ఉన్నారు.

దుర్గామాతకు ప్రత్యేక పూజలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గుడిపేట 13వ ప్రత్యేక బెటాలియన్‌తో పాటు ముల్కల్ల, హాజీపూర్, దొనబండ గ్రామాల్లో ఏర్పాటు చేసిన దేవి మండపాల్లో శనివారం భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. బెటాలియన్ లోని దుర్గాదేవి మండపంలో బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు దంపతులు చండీయాగంలో పాల్గొన్నారు.

గాయత్రి దేవిగా దర్శనం

జన్నారం: శరన్నవరాత్రోత్సవాలలో భాగంగా శనివారం అమ్మవారు గాయత్రి దేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. మండల కేంద్రంతో వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కనక దుర్గ అమ్మవారు విశేష పూజలందుకుంటున్నారు. నారింజ రంగు చీరలో, ఎర్రటి గాజులతో అమ్మవారిని అలంకరించి, నిమ్మకాయ పులిహోరతో నైవేద్యం సమర్పించారు. నిర్వాహకులు ప్రశాంత్‌చారి, అనిల్‌చారి, సంతోష్ ఉన్నారు.

ముల్కల్లలో సమగ్ర ఆరోగ్య ప్రచార కార్యక్రమం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామ పంచాయతీలో శనివారం సమగ్ర ఆరోగ్య ప్రచార కార్యక్రమంలో భాగంగా దిశ ఎన్‌జీవో ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై స్థానికులకు అవగాహన కల్పించి 31 మందికి రక్త పరీక్షలు జరిపారు. శిబిరంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ ప్రసన్న, సీహెచ్‌వో జయమేరీ, డీఎస్‌ఆర్‌సీ కౌన్సెలర్ నరేందర్‌రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ రాజేందర్, ఏఎన్‌ఎం ఆదిలక్ష్మి, ఆశా కార్యకర్త స్నేహ, ఎన్‌జీవో సిబ్బంది పాల్గొన్నారు.

'పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి'

మంచిర్యాలటౌన్: పట్టభద్రులు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఐఎంఏ నాయకులు డాక్టర్ బి.యస్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు వారి హక్కుగా ఓటును నమోదు చేసుకోవాలన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో సమూలమైన మార్పులు రావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. జిల్లా ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రమణ, వైద్యులు పాల్గొన్నారు.

కొండలు, గుట్టలు మాయం!

- అక్రమంగా మొరం తవ్వకాలు
- రాత్రివేళ తరలిస్తున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు



గూడెం గుట్టల్లో మొరం తవ్వకాలు జరిపే ప్రదేశంలో నిలిపి ఉంచిన జేసీబీ

దండేపల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లో కొండలు, గుట్టలు క్రమేణ మాయమవుతున్నాయి. కొందరు అక్రమార్కులు నిబంధనలకు విరుద్ధంగా మొరం తవ్వకాలు చేపడుతూ ప్రకృతి విధ్వంసం సృష్టిస్తున్నారు. 63వ జాతీయ రహదారిని ఆనుకుని మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయ కొండకు వెనకాల ఉన్న గుట్టలతో పాటు, మండలంలోని నంబాల, రంగపల్లె సమీపంలోని కొండలు, గుట్టలు ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే ఇష్టారాజ్యంగా అక్రమార్కులు తవ్వకాలు జరుపుతున్నారు.

గుట్టుగా తవ్వకాలు..

మొరం, క్వారీ తవ్వకాల కోసం తహసీల్దార్ నుంచి ఎన్‌వోసీ తీసుకుని గనుల శాఖకు అందజేయాల్సి ఉంటుంది. అనంతరం సర్వేయర్ అనుమతి కోరిన చోట మైనింగ్‌కు అవకాశం ఉందా? లేదా? ఎంత మేర తరలించాలి? సీనరేజీ చార్జీలు ఎంతమేర చెల్లించాలి? వంటి వాటిని పరిశీలించి అనుమతులిస్తారు. అవేమి లేకుండా కొందరు వ్యక్తులు మండలంలో గుట్టుగా గుట్టల్లోంచి మొరం తవ్వకాలు జరుపుతున్నారు. గూడెం, నంబాల గ్రామాలకు చెందిన కొందరు జేసీబీ, టిప్పర్ యజమానులు యధేచ్ఛగా మొరం తవ్వకాలు చేపడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోకుండా మాముళ్ల మత్తులో మునుగుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

రాత్రివేళల్లో తవ్వకాలు..

మొరం తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేకపోవడంతో రాత్రివేళ తవ్వకాలు జరుపుతున్నారు. మొరం తవ్వకాలను గుట్టుగా చేపట్టే జేసీబీ, టిప్పర్ యజమానులు పగటివేళ జేసీబీలను మొరం తవ్వకాలు చేపట్టే ప్రదేశానికి కొద్ది దూరంలో నిలిపి ఉంచుతున్నారు. రాత్రివేళ సుమారు 11గంటలు దాటిన తర్వాత వాటిని మొరం తవ్వకాలు జరిపే చోటుకు తీసుకెళ్లి జేసీబీలతో మొరం తవ్వకాలు చేపట్టి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా మొరాన్ని తెల్లవారే వరకు తరలించాల్సిన చోటికి చేరవేస్తున్నారు. అక్రమ మొరం తవ్వకాలను అరికట్టాల్సిన సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో, ఎత్తయిన కొండలు, గుట్టలు నేలమట్టమవుతూ, ప్రకృతి సంపద కనుమరుగవుతోంది. అధికారులు దృష్టి సారించి, అక్రమ మొరం తవ్వకాలు అడ్డుకోవాలని పలువురు కోరుతున్నారు. మొరం తవ్వకాలకు సమీపంలో నిలిపి ఉంచుతున్న జేసీబీలను ముందుగా అక్కడి నుంచి తొలగిస్తే, మొరం తవ్వకాలు కొంతమేర అరికట్టే అవకాశం ఉంది. అధికారులు స్పందించి గూడెం, రంగపల్లె, నంబాల సమీపంలో మొరం తవ్వకాలు జరిపే ప్రదేశాలకు సమీపంగా నిలిపి ఉంచిన జేసీబీలను తొలగించాలని స్థానికులు పేర్కొంటున్నారు. అక్రమంగా మొరం తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎలాంటి అనుమతులు లేవు

మండలంలోని గూడెం, రంగపల్లె, నంబాల గ్రామాల సమీపంలోని గుట్టల్లో మొరం తవ్వకాలకు ఎవరికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. అనుమతులు లేకుండా ఎవరైనా మొరం తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటాం.

\- సంధ్యారాణి, తహసీల్దార్, దండేపల్లి

బతుకమ్మకు పూల కొరత

- కానరాని తంగేడు, గునుగు పూలు
- నేడు సద్దుల బతుకమ్మ



అరకొరగా పూసిన తంగేడు

నెన్నెల: ఒకప్పుడు సద్దుల బతుకమ్మ నాటికి ఊరు శివారుల్లో విరగబూసిన గునుగు, తంగేడు, సీతమ్మ జెడల పూలు కన్పించేవి. కానీ ప్రస్తుతం బతుకమ్మ పేర్చడంలో కావాల్సిన తెలంగాణ పుష్పం తంగేడు, గునుగు పూలకు కొరత ఏర్పడింది. కాలక్రమేణా అడవులు, బీడు భూములు, చెలకలు తగ్గిపోవడంతో పూలు కనుమరుగవుతున్నాయి. కూలీల కొరతతో చేలల్లో కలుపు మందులు వాడుతుండడంతో గునుగు, సీతమ్మ, గడ్డిజాతి మొక్కలు అంతరిస్తున్నాయి. కాగా నేడు సద్దుల బతుకమ్మ నిర్వహించనున్నారు.

ప్రత్యామ్నాయ పూలే దిక్కు

తంగేడు, గునుగు పూలు లేకపోవడంతో చాలా చోట్ల రోడ్ల పక్కనే పెరిగే హైబ్రిడ్ తంగేడు, టేకు చెట్ల పూలతో బతుకమ్మలు పేర్చుతున్నారు. అది దొరకని వారు రూ.100 కిలో చొప్పున బంతిపూలు కొనుగోలు చేస్తున్నారు.

పూలు దొరకడం లేదు



ఒకప్పుడు ఊరి పొలిమేరల్లోనే కావాల్సినంత తంగేడు, గునుగు పూలు దొరికేవి. ఇప్పుడు చేలు లేక ఎక్కడా పూలు దొరకడం లేదు. ఊరు శివారులోకి వెళ్లి పూలను మూటగట్టుకొని వచ్చేవాళ్లం. నిలువెత్తు బతుకమ్మను పేర్చేవాళ్లం. ప్రస్తుతం చిన్న బతుకమ్మలతోనే సరిపెడుతున్నారు.

\- నూతి సూరమ్మ, నెన్నెల

ధరలు బాగా పెరిగాయి..



రూ.300 పెడితే కొన్ని పూలే వస్తున్నాయి. ఈ పూలు తల్లి బతుకమ్మ సంగతేమో గాని పిల్ల బతుకమ్మకు కూడా సరిపోవడం లేవు. పూల ధరలు బాగా పెరిగాయి. చేసేది ఏమి లేక బంతి పూలతోనే నెట్టుకొస్తున్నాం. రూ.100 పెడితే కిలో బంతి పూలు కూడా వస్తలేవు.

\- రమాదేవి, లక్సెట్టిపేట

పంచాయతీ కార్మికుల ఆందోళన

నెన్నెల: పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ నెన్నెల మండల గ్రామపంచాయతీల కార్మికులు శనివారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ వేతనాలు సకాలంలో చెల్లించకపోవడంతో పూటగడవడం కష్టంగా మారిందన్నారు. మండల పంచాయతీ కార్మికులు వెంకటేశ్, శ్రీనివాస్, మనోజ్, రాజేశ్, కుమారస్వామి, క్రాంతి, వీరారెడ్డి, రాజు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటస్వామి జయంతి



బెల్లంపల్లిరూరల్: నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్



శ్రీరాంపూర్: పూలమాల వేస్తున్న శ్రీనివాస్

సాక్షి నెట్‌వర్క్: స్వర్గీయ కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి జి.వెంకటస్వామి జయంతిని శనివారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఆయా మండలాల్లో, వివిధ ప్రభుత్వ, పార్టీ కార్యాలయాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు, అధికారులు నివాళులర్పించారు. శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయంలో కాక జయంతి వేడుకలను ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, టీఎన్జీవోస్ భవన్‌లో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఓపెన్ డిగ్రీ అడ్మిషన్ గడువు పొడిగింపు

మంచిర్యాలఅర్బన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో అడ్మిషన్ల గడువు ఈనెల 15 వరకు పొడిగించినట్లు మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిప్లొమా పూర్తి చేసిన వారు బీఏ, బీకాం, బీఎస్సీ, బీజెడ్సీల కోర్సులో చేరేందుకు అవకాశం ఉందన్నారు. వివరాలకు మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అంబేద్కర్ స్టడీ సెంటర్‌లో సంప్రదించాలని సూచించారు.

దుబాయిలో ఉద్యోగావకాశాలు

పాతమంచిర్యాల: దుబాయిలో బైక్‌రైడర్స్/డెలివరీ బాయ్స్ ఉద్యోగాల కోసం దరఖాస్తులు కోరుతున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాల కోసం 21 -40 ఏళ్ల వయస్సు ఉండి ఎస్సెస్సీ పాసై ఉండాలన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 7న ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ ప్రతినిధులు నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేలో తప్పులుండొద్దు



సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

మంచిర్యాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను ఎలాంటి తప్పులు లేకుండా చేపట్టాలని మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ అన్నారు. పైలట్ ప్రాజెక్టుగా మంచిర్యాల మున్సిపల్ పరిధిలోని 16వ వార్డు అశోక్ రోడ్డులో నిర్వహిస్తున్న డిజిటల్ కార్డు సర్వేను కమిషనర్ శనివారం పరిశీలించారు. ఎలాంటి తప్పులకు తావు ఇవ్వకుండా సర్వేను చేపటి ప్రభుత్వానికి నివేదించాలని సిబ్బందికి సూచించారు.

'ఓటు యువతకు వజ్రాయుధం'

మంచిర్యాలఅర్బన్: ఓటు యువతకు వజ్రాయుధమని బీఎస్‌రావు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బీఎస్‌రావు అన్నారు. శనివారం మంచిర్యాలలో ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఐఎంఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టుభద్రులంతా వారి ఓటు హక్కు పొందాలన్నారు. ఓటరు నమోదును ఆన్‌లైన్‌లో ఎలా దరఖాస్తు చేసుకోవాలనే అంశాలను వివరించారు.

గ్రామీణులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి



మాట్లాడుతున్న సుధాకర్ నాయక్

బెల్లంపల్లిరూరల్: గ్రామీణ ప్రాంత ప్రజలకు, పీహెచ్‌సీకి వచ్చే వారికి వైద్య సేవలు అందించడంలో ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని బెల్లంపల్లి డెప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్ అన్నారు. శనివారం బెల్లంపల్లి మండలం తాళ్లగురిజాల పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పీహెచ్‌సీ రికార్డులు, పరిసరాలు తనిఖీ చేశారు. పీహెచ్‌సీ ఓపీ వివరాలు, సిబ్బంది పనితీరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బుధాకలాన్ గ్రామంలో చేపడుతున్న హెచ్‌ఐవీ స్క్రీనింగ్ శిబిరాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి తమ్మడి ఎవంజలీన్, నర్సింగ్ ఆఫీసర్ సునీత, ఫార్మసిస్ట్ సాగర్, ల్యాబ్ టెక్నీషియన్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ సుధారాణి, ఐసీటీసీ జగన్, ఏఎన్‌ఎం రాజమణి, వైద్య సిబ్బంది ఉన్నారు.

'ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం'



రాస్తారోకో చేస్తున్న సీపీఐ శ్రేణులు

బెల్లంపల్లిరూరల్: రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా విఫలమయ్యాయని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు వెంకటస్వామి, పట్టణ కార్యదర్శి రాజమౌళి అన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు నిరసనగా శనివారం బెల్లంపల్లిలోని కాంటా చౌరస్తా వద్ద సీపీఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బొల్లం పూర్ణిమ, జిల్లా కార్యవర్గ సభ్యుడు చిప్ప నర్సయ్య, మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ, పట్టణ సహాయ కార్యదర్శి ఉపేందర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొంకుల రాజేష్, సీనియర్ నాయకులు చంద్రమాణిక్యం, అక్కెపల్లి బాపు, అమృత, సోని, ఐలయ్య, రాంచందర్, రాజం, తిలక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు



జన్నారం: బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



మందమర్రిరూరల్: బతుకమ్మ ఆడుతున్న ఉద్యోగులు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి పట్టణంలోని భవిత డిగ్రీ కళాశాలలో శనివారం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాలలో ఏర్పాటు చేసిన వేడుకల్లో విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మ పేర్చి సంబరాలు జరుపుకున్నారు. కళాశాల కరస్పాండెంట్ హీరాలాల్, ప్రిన్సిపాల్ కన్నారావు, ఇన్‌చార్జి రాజేందర్, పీడీ కృష్ణమూర్తి, మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కళాశాలలో ముందస్తు బతుకమ్మ..

జన్నారం: మండలంలోని జూనియర్, డిగ్రీ కళాశాలలకు బతుకమ్మ పండుగ సెలవులు రావడంతో మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల, ఏఆర్‌ఎస్ డిగ్రీ కళాశాలల్లో శనివారం విద్యార్థినులు బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం బతుకమ్మలను సమీపంలోని వాగులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సతీశ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో..

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని అశోక్‌రోడ్డు 3 అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. చిన్నారుల తల్లులు, అంగన్‌వాడీ టీచర్ భాగ్యలక్ష్మి, ఆయా అనిత, మహిళా సాధికారక సభ్యురాలు లిప్సిక పాల్గొని, బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు.

జీఎం ఆఫీస్‌లో..

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో శనివారం బతుకమ్మ సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. సేవా సమితి ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆడుతూ పాటలు పాడారు. సింగరేణి సంస్థ మహిళా పండుగలకు ప్రాధాన్యతనిస్తూ గౌరవిస్తుందని ఏరియా జీఎం దేవేందర్ తెలిపారు. సేవా సమితి ఏరియా అధ్యక్షురాలు స్వరూపరాణి దేవేందర్ మహిళా ఉద్యోగులుతో కలిసి బతుకమ్మ ఆడారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

తాండూర్: మండలంలోని విద్యా భారతి పాఠశాలల పూర్వ విద్యార్థుల బృందం ఆధ్వర్యంలో శనివారం క్రికెట్ టోర్నీ ప్రారంభమైంది. మాదారం పోలీస్‌స్టేషన్ గ్రౌండ్‌లో 'విద్యా భారతి బలగం' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్‌టోర్నీని విద్యా భారతి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు సురభి ఆగమ రావు, తాండూర్ సీఐ కుమారస్వామి ప్రారంభించారు. టోర్నీలో విద్యాభారతి విద్యాసంస్థలో 1999 నుంచి 2012 వరకు పదవ తరగతి పూర్తి చేసుకున్న 13 బ్యాచ్‌లు పాల్గొననున్నాయి. ఎస్సైలు కిరణ్ కుమార్, సౌజన్య, మాజీ ఎంపీటీసీలు రవీందర్ రెడ్డి, చిరంజీవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

'పట్టణ అభివృద్ధి చర్యలు స్వాగతిస్తున్నాం'

పాతమంచిర్యాల: మంచిర్యాల నియోజకవర్గంతో పాటు మంచిర్యాల పట్టణ అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, మున్సిపల్, జిల్లా అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలను స్వాగతిస్తున్నామని సీపీఐ పట్టణ కార్యదర్శి ఖలిందర్ అలీఖాన్ అన్నారు. శనివారం జిల్లా సీపీఐ కార్యాలయంలో నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు చాడా మహేందర్‌రెడ్డి, కోడి వెంకన్న, రాజేశం, యాదగిరి, రవి కుమార్ పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

కోటపల్లి: మండలంలోని రోడ్లన్నీ బాగు చేయించి ఆర్టీసీ బస్సు వచ్చేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు మంత్రి రామయ్య డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని సిర్సా గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు అస్తవ్యస్తంగా మారిన రోడ్లన్నీ బాగు చేయించి ఆర్టీసీ బస్సు వేయించాలన్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో నిరుపేదలు అధిక చార్జీలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడు పున్నం, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లు రద్దు చేయాలి

పాతమంచిర్యాల: అగ్రవర్ణ పేదలకు అమలు చేస్తున్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లు రద్దు చేయాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ల వల్ల బీసీలకు నష్టం జరుగుతుందన్నారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్‌లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి అక్కల రమేశ్, సభ్యులు కే.రమేశ్ ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

కోటపల్లి: మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నక్కలపల్లికి వెళ్లే దారిలోని లొతొర్రె వాగుపై వంతెన పూర్తిగా కొట్టుకుపోయింది. నక్కలపల్లి, బ్రహ్మణపల్లి, బద్దంపల్లి గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతుండగా శ్రావణ్‌రెడ్డి అనే యువకుడు తాత్కాలిక రోడ్డుకు మరమ్మతులు చేయించాడు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

శ్రీరాంపూర్: దొంగతనాలు, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని, కాలనీ వాసులు వీటిని ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై సంతోష్ తెలిపారు. శనివారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉదయనగర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయన మాట్లాడుతూ సీసీ కెమెరాల వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. యువత డ్రగ్స్‌కు బానిస కావద్దని, డ్రగ్స్‌పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం నంబర్ ప్లేట్ సరిగా లేని 25 టూవీలర్లు, రెండు ఆటోలను సీజ్ చేశారు.

ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌గా (ఎఫ్ఏసీ) ముత్యం బుచ్చన్న శనివారం బాధ్యతలు స్వీకరించారు. సెప్టెంబర్‌లో రాష్ట్రవ్యాప్త ప్రిన్సిపాల్, పీజీటీ, టీజీటీల బదిలీలు జరిగాయి. మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ (ఎఫ్ఏసీ)గా బుచ్చన్న నియమితులయ్యారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నెన్నెల: మామిడిగట్టు గ్రామానికి చెందిన రాంటెంకి మధుకర్ (37) గత వారం రోజుల క్రితం కిడ్నీ సంబంధిత వ్యాధితో మృతి చెందాడు. శనివారం తనతో కలిసి చదువుకున్న బాల్య మిత్రులు స్పందించి రూ.11 వేలను మధుకర్ కుటుంబానికి అందజేశారు. బండి ప్రకాశ్, రాజేశం, నవీన్, కిషన్ రెడ్డి, సంతోష్ ఉన్నారు.

వేంపల్లిలో మండలస్థాయి క్రికెట్ పోటీలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి శివారులో శనివారం ఏర్పాటు చేసిన మండలస్థాయి క్రికెట్ పోటీలను గ్రామ మాజీ సర్పంచులు డేగ బాపు, గోనె సంజయ్‌రావు చేతుల మీదుగా ప్రారంభించారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ. 10 వేలు, రెండో బహుమతిగా రూ.5 వేల నగదు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సామాజిక భద్రత పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

శ్రీరాంపూర్: కేంద్ర ప్రభుత్వ సామాజిక భద్రత పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సీతారాంపల్లి శాఖ నిర్వాహణ అధికారి నరసింహస్వామి తెలిపారు. శనివారం సీసీసీ కార్నర్‌లోని బ్యాంక్ వద్ద బ్యాంక్ పథకాలపై అవగాహన కల్పించారు.

డిప్యూటీ సీఎంకు స్వాగతం

మంచిర్యాలటౌన్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఇటీవల విదేశాలకు వెళ్లి, పర్యటనను ముగించుకుని హైదరాబాద్ రాగా ఆయనకు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు ఘన స్వాగతం పలికారు.

దరఖాస్తులకు ఆహ్వానం

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఆరు కోర్సుల్లో అడ్మిషన్ కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించినట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ దేవానంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ కావాల్సిన వారు ఈ నెల 9లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, మెరిట్ ప్రకారం సీటు కేటాయిస్తామన్నారు.

'కార్మికుల పక్షాన ఏఐటీయూసీ పోరాటం'



మాట్లాడుతున్న సీతారామయ్య

కాసిపేట: సుదీర్ఘ చరిత్ర కలిగిన ఏఐటీయూసీ కార్మికుల పక్షాన నిరంతరం పోరాటం చేస్తుందని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. శనివారం మందమర్రి ఏరియా కాసిపేట -2 గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. లాభాల వాటపై సంఘాలు చేస్తున్న విమర్శలు సరికాదన్నారు. గతం నుంచి పోల్చుకుంటే ఈ దఫా అధికంగా కార్మికులకు డబ్బులు వస్తున్నాయని, గత 24 సంవత్సరాలుగా ఇచ్చిన విధంగానే లాభాల వాటా ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, ఫిట్ సెక్రెటరి శ్రీనివాస్, వెంకటేశ్, రత్నం ఐలయ్య, నర్సయ్య పాల్గొన్నారు.